# కూకట్‌పల్లిలో 'బీజేపీ'దే హవా

- బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు 1,095,820 ఓట్లు
- 25,120 ఓట్ల మెజార్టీని సాధించిన ఈటల
- రెండో స్థానంలో 84,700 ఓట్లతో కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి
- మూడో స్థానంలో 32,788 ఓట్లతో రాగిడి లక్ష్మారెడ్డి
- 21 రౌండ్లకు గాను.. 17 రౌండ్లలో బీజేపీదే హవా...
- 4 రౌండ్లలో కాంగ్రెస్ జోరు..



సంబురాలు చేసుకుంటున్న కూకట్‌పల్లి బీజేపీ నేతలు



కేపీహెచ్‌బీ కాలనీలో సంబురాల్లో టీడీపీ, జనసేనా, బీజేపీ నేతలు

కేపీహెచ్‌బీ కాలనీ/మియాపూర్, జూన్ 4 : మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాషాయం జెండా తొలిసారి రెపరెపలాడింది. పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో నియోజకవర్గంలో 2,33,714 మంది ఓటర్లు(48.48శాతం) మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంగళవారం ప్రకటించిన ఫలితాల్లో మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ 3.80లక్షల మెజార్టీతో భారీ విజయాన్ని సొంతం చేసుకున్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి ఈటల 1,09,820 ఓట్లును సాధించగా, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి 84,700 ఓట్లను, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి 32,788 ఓట్లను కైవసం చేసుకున్నారు. నోటాకు 1510 ఓట్లు పోలయ్యాయి. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఆధిక్యాన్ని సాధించిన బీజేపీ... కూకట్‌పల్లి నియోజకవర్గంలో సైతం మెజార్టీ ఓట్లతో గెలుపులో కీలకంగా మారింది. కూకట్‌పల్లి నియోజకవర్గంలోనే.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిపై బీజేపీ అభ్యర్థి 25,120 ఓట్ల ఆధిక్యాన్ని సాధించడంతో... ఈటల రాజేందర్‌కు భారీ మెజార్టీ సొంతమైంది. అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రెండవ స్థానంతో... బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మూడో స్థానంతో సరిపెట్టుకున్నారు. ఎన్నికల ఫలితాల్లో ప్రక్రియలో... కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన ఓట్లను 21 రౌండ్‌లుగా లెక్కింపు జరుపగా, కేవలం నాలుగు (6,13,14,15) రౌండ్‌లలో మాత్రమే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆధిక్యాన్ని సాధించగా.. మిగిలిన 17 రౌండ్‌లలో బీజేపీ పార్టీ అభ్యర్థి సంపూర్ణ హవాను కొనసాగించారు. ఏ ఒక్క రౌండ్‌లోనూ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆధిక్యతను సాధించలేదు.

**ఐదు నెలల్లోనే తారుమారు...**

కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే... ఐదు నెలల కాలంలోనే ప్రధాన పార్టీల ఓటు బ్యాంక్ తారుమారైంది. తెలంగాణలో ఇటీవల జరిగిన అసెంబ్లీ (2023 డిసెంబర్‌లో)ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాధవరం కృష్ణారావు 1,36,635 ఓట్లతో... సమీప కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిపై 71,387 ఓట్ల మెజార్టీతో విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే... కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేశ్ 65,248 ఓట్లతో రెండో స్థానంలో, 39,890 ఓట్లతో జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ మూడో స్థానంలో నిలిచారు. గతంలో మూడో స్థానానికి పరిమితమైన బీజేపీ అభ్యర్థి 1లక్షకు పైగా ఓట్లను సాధించి మొదటి స్థానంలో నిలువగా.. అధికార కాంగ్రెస్ పార్టీ కేవలం 15వేల ఓటు బ్యాంక్‌ను పెంచుకుని రెండోస్థానాన్ని కాపాడుకున్నది. గత అసెంబ్లీ ఎన్నికల్లో 1.36 లక్షల ఓట్లతో మొదటి స్థానంలో నిలిచిన బీఆర్ఎస్ పార్టీ.. పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం కేవలం 31 వేల ఓట్లకు పరిమితం కావడం కూకట్‌పల్లిలో పలు చర్చలకు దారితీస్తున్నది. ఆ ఎన్నికల్లో సాధించిన మెజార్టీ ఓట్లను కూడా సాధించలేక మూడో స్థానంలో నిలిచింది.

**ఈటల గెలుపుతో సంబురాలు..**

మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థిగా ఈటల రాజేందర్ భారీ మెజార్టీతో విజయం సాధించగా...కూకట్‌పల్లిలో బీజేపీ నేతలు సంబురాలు చేసుకున్నారు. కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయం వద్ద టపాసులు కాల్చి.. మిఠాయిలు పంపిణీ చేసుకున్నారు. బ్యాండ్‌మేళా, చప్పట్లకు స్టెప్పులేస్తూ.. సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి నర్సింగరావు మాట్లాడుతూ.. కేంద్రంలో ప్రధాని మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం పదేండ్ల కాలంగా సుపరిపాలన అందించిందని, అన్ని వర్గాల సంక్షేమానికి పాటు పడుతూ.. దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిందన్నారు. ఈటల రాజేందర్ గెలుపుకోసం పనిచేసిన బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు మాధవరం కాంతారావు, సూర్యప్రకాశ్ రావు, సూర్యారావు, బీజేపీ నేతలు ఉన్నారు.

– ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, బీజేపీ, జనసేనా పార్టీల కూటమి నేతలు భారీ మెజార్టీతో విజయం సాధించడంతో కేపీహెచ్‌బీ కాలనీలో కూటమి నేతలు సంబురాలు చేసుకున్నారు. కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్ టెంపుల్ బస్టాప్‌లో పటాసులు కాల్చి.. స్వీట్లు పంచి పెడుతూ సంబురాలు చేసుకున్నారు. కాలనీలో బైక్ ర్యాలీ నిర్వహించి.. జై మోదీ, జై చంద్రబాబు, జై పవన్ కల్యాణ్ అంటూ నినాదాలు చేశారు. వసంతనగర్ కాలనీ, కాలనీ ధనలక్ష్మి సెంటర్, మహారాష్ట్ర బ్యాంక్ సెంటర్, కూకట్‌పల్లి, మూసాపేట పరిసర ప్రాంతాల్లో కూటమి అభిమానులు రంగులు చల్లుకుంటూ... నినాదాలు చేస్తూ... కేరింతలు కొడుతూ సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేనా పార్టీల నేతలు ఉన్నారు.

– మియాపూర్ : ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో కూటమి విజయం సాధించిన నేపథ్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులు మంగళవారం సంబురాలు నిర్వహించారు.




అల్లాపూర్ సొసైటీలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నినాదాలు చేస్తున్న టీడీపీ శ్రేణులు

ఆయా డివిజన్లలో ద్విచక్ర వాహనాలపై టీడీపీ, జనసేన జెండాలను ప్రదర్శిస్తూ ర్యాలీలు తీశారు. అల్లాపూర్ సొసైటీలో ఎన్టీఆర్ విగ్రహానికి పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి నినాదాలు చేశారు.



కూకట్‌పల్లిలో సంబురాలు చేసుకుంటున్న బీజేపీ నేతలు



మల్కాజిగిరి పార్లమెంటు స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఘనవిజయాన్ని హర్షిస్తూ మన్సూరాబాద్‌లో పటాకులు కాల్చి సంబురాలు జరుపుకొంటున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి. – మన్సూరాబాద్, జూన్ 4

## చంద్రబాబుకు శుభాకాంక్షలు

మణికొండ,జూన్ 4 : ఏపీలో భారీ మెజార్టీ సాధించి గెలుపొందిన నారా చంద్రబాబు నాయుడికి హార్థిక శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాసంక్షేమమే ప్రధాన ఎజెండాగా పరిపాలనను సాగించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రెండు రాష్ర్టాల్లో సత్సంబంధాలను ఎప్పటిలాగే కొనసాగిస్తారని కోరుకుంటున్నామన్నారు. భారీ మెజార్టీతో మరోసారి ఆంధ్రప్రజలకు సేవలందించేందుకు ముందుకు వచ్చిన చంద్రబాబునాయుడికి ప్రజల అండదండలు ఎల్లప్పుడూ ఉండాలని కోరారు.

## ఘనంగా వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



సర్దార్‌పటేల్ నగర్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవ పూజలో భక్తులు

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 4: కేపీహెచ్‌బీ కాలనీ సర్దార్‌పటేల్ నగర్‌లోని శ్రీలక్ష్మీగోదా దేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు కోలాహలంగా సాగుతున్నాయి. మంగళవారం ఉదయం విశ్వక్షేనారాధనం, పుణ్యాహావచనం, యాగశాల కైంకర్యములు, పల్లకి ఉత్సవం, మోహినీ అలంకరణలో ఊరేగింపు, సాయంత్రం వేదము, నాదము, కీర్తనలతో ఊంజల్ సేవ పూజలు జరిగాయి. అనంతరం ఎంఎస్ శ్రీనివాస్‌చే ప్రవచనాలను భక్తులు ఆలకించారు. రాత్రి లక్ష్మీహారం ఊరేగింపు, గరుడవాహన సేవ ఊరేగింపు పూజలు ఘనంగా జరిగాయి. బుధవారం ఉదయం విశ్వక్షేనారాధనం, పుణ్యాహావచనం, పంచాయుధాధారిగా సూర్యవాహన సేవ ఊరేగింపు పూజలు ఉంటాయి. సాయంత్రం ఉత్సవ మూర్తులకు వసంతోత్సవం, యాగశాల వైదిక కైంకర్యములతో పాటు గరికపాటి నర్సింహారావుచే ప్రవచనాలు ఉంటాయి. రాత్రి గజవాహన సేవ, ఊరేగింపు పూజలుంటాయి. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేంకటేశ్వరస్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.



సంజన(ఫైల్)

## కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 4 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో మంగళవారం కూరగాయల ధరలు (కేజీ–రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 39, వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 50, బజ్జి మిర్చి 50, కాకరకాయ 38, బీరకాయ 35, క్యాబేజీ 19, ఫ్రెంచ్ బీన్స్ 105, క్యారెట్ 40, కాలీఫ్లవర్ 23, దొండ 18, చిక్కుడు 65, గోరుచిక్కుడు 45, బీట్‌రూట్ 23, క్యాప్సికం 50, ఆలుగడ్డ 33, కీరా 23, దోసకాయ 23, సొరకాయ 11, పొట్లకాయ (1) 15, కందగడ్డ 65, ఉల్లిపొరక 65, ఉల్లిగడ్డ 27, మామిడికాయ(1) 10 నుంచి 15, అరటికాయ(1) 8 నుంచి 10, చామగడ్డ 40, ముల్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 31, గుమ్మడికాయ 35, నిమ్మకాయలు(12) 65 నుంచి 75, మునగకాయ(1) 4 నుంచి 5, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 200, వెల్లుల్లి 240, చింతపండు 120, కరివేపాకు 80గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

## విద్యార్థిని అదృశ్యం



సంజన(ఫైల్)

ఘట్‌కేసర్,జూన్4: కళాశాలకు వెళ్లిన ఓ విద్యార్థిని అదృశ్యమైంది. ఈ సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. సీఐ సైదులు వివరాల ప్రకారం.. దాసోసు సంజన (18) ఉప్పల్ విజయపురి కాలనీలో నివాసం ఉంటుంది. అవుశాపూర్‌లోని అగ్రికల్చర్ యూనివర్సిటీలో అగ్రికల్చర్ మొదటి సంవత్సరం చదువుతుంది. కాగా.. ఈనెల 3న కళాశాలకు వెళ్లిన సంజన సాయంత్రం కళాశాల బస్సులో వచ్చి ఉప్పల్‌లో దిగింది. అయితే ఇంటికి వెళ్లలేదు. దీంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు.. సంజనకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. సరిపర ప్రాంతాల్లో గాలించినా, బంధువులు, స్నేహితుల ను ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## మేడ్చల్‌లో బీజేపీకి 1.88 లక్షల ఓట్లు



కలెక్టర్ నుంచి ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న ఈటల రాజేందర్

మేడ్చల్, జూన్ 4 : మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో ఉన్న అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోని మేడ్చల్‌లో బీజేపీ పట్టు నిలుపుకుంది. నగర శివారులో ఉన్న మేడ్చల్ నియోజకవర్గం పట్టణ, గ్రామీణ సమ్మిళితంగా ఉన్నది. అన్ని నియోజకవర్గాల కంటే అత్యధిక శాతం ఓటింగ్ మేడ్చల్‌లో జరిగింది. పోటీచేసే అభ్యర్థులకు ఎక్కువ ఓట్లు ఇక్కడే వచ్చాయి. నియోజకవర్గ వ్యాప్తంగా 6,65,979 మంది ఓటర్లు ఉండగా, 3,85,134 ఓట్లు పోలయ్యాయి. అందులో బీజేపీకి లక్షా 88వేల 370 ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు లక్షా 19వేల 125 ఓట్లు, బీఆర్ఎస్‌కు 67,246 ఓట్లు వచ్చాయి. నోటాకు 2456 మంది ఓటేశారు. పూర్తి ఫలితాలు వెల్లడి కానున్న సమయంలో బోగారంలోని ఓట్ల లెక్కింపు కేంద్రానికి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ చేరుకున్నారు. మీడియా పాయింట్ వద్ద ఫలితాలపై మాట్లాడారు. అధికార కాంగ్రెస్ పార్టీ ఓటర్లను ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా ఓటర్లు మాత్రం బీజేపీ వైపు మొగ్గ చూపారన్నారు. ఆ పార్టీతో సరిసమానంగా సీట్లు బీజేపీకి దక్కాయని, రానున్న భవిష్యత్ బీజేపీదే అని అన్నారు. కంటోన్మెంట్‌తో పాటు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారా నికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం కలెక్టర్ నుంచి ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు.

## ద్విచక్ర వాహనం చోరీ

బంజారాహిల్స్,జూన్ 4: బైక్ నడిపిస్తూ అదుపుతప్పి కిందపడిన వ్యక్తికి చెందిన బైక్‌తో పాటు నగదు,సెల్‌ఫోన్ మాయమైన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఓల్డ్ మిర్జాల్‌గూడకు చెందిన జానకీరామ్ అనే వ్యక్తి గత నెల 24న ఇంటినుంచి తన బైక్ మీద ఆఫీసుకు బయల్దేరాడు. బంజారాహిల్స్ రోడ్ నెం 3లోని టీవీ 9 చౌరస్తా దాటగానే జానకీరామ్ కళ్లు తిరిగి బైక్‌మీద నుంచి కిందపడిపోయాడు. ఈ ఘటనలో అతడు స్వల్పంగా గాయపడటంతో పాటు స్పృహ కోల్పోయాడు. స్థానికులు అతడిని సికింద్రాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో చేర్చారు. ఆస్పత్రికి తీసుకువెళ్లే క్రమంలో అతడివద్ద ఉన్న రూ.20 వేల నగదు. సెల్‌ఫోన్ మాయమయ్యాయి. ఐదు రోజుల తర్వాత ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన జానకీరామ్ ప్రమాదం తర్వాత రోడ్డుపక్కన పార్క్ చేసిన బైక్ కోసం వచ్చి చూడగా సమీపంలో ఎక్కడా కనిపించలేదు. అన్ని ప్రాంతాల్లో గాలించినా ప్రయోజనం లేకపోవడంతో మంగళవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన బైక్ మీద నాంపల్లిలో ట్రాఫిక్ సిగ్నల్‌వద్ద హెల్మెట్ లేకుండా ఓవ్యక్తి నడిపించడంతో గత నెల 30న చలానా పడిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పోరాట ప్రస్తావన లేకపోవడం బాధాకరం



బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని రావి నారాయణరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

బంజారాహిల్స్,జూన్ 4: తెలంగాణ రాష్ట్ర గీతంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం గురించి ప్రస్తావన లేకపోవడం బాధాకరమని సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ అధ్యక్షుడు సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. ప్రముఖ కమ్యూనిస్టు నేత రావి నారాయణరెడ్డి 118వ జయంతిని పురస్కరించుకుని బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని ఎమ్మెల్యే కాలనీలో ఉన్న రావి నారాయణరెడ్డి ఆడిటోరియం వద్ద తెలంగాణ అమరవీరుల ట్రస్ట్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ అమరవీరుల స్మారకట్రస్ట్ అధ్యక్షుడు సురవరం సుధాకర్‌రెడ్డి, సీపీఐ నారాయణ, చాడ వెంకట్‌రెడ్డి, పల్లా వెంకటరెడ్డి, ఈటీ, నర్సింహ, కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి తదితరులు రావి నారాయణరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురవరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ..నిజాం నిరంకుశ పాలనకు. రజాకార్లకు వ్యతిరేకంగా మక్దుం మొహియుద్దీన్. బద్దం ఎల్లారెడ్డి తదితర నేతలతో కలిసి గెరిల్లా యుద్ధాలు ప్రారంభించి వారి వెన్నులో చలిపుట్టించిన ఘనత రావినారాయణరెడ్డికి దక్కుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకల్లో తెలంగాణ సాయుధ పోరాట యోధులను స్మరించుకోకకపోవడం. రాష్ట్ర గీతంలో తెలంగాణ సాయుధ పోరాటం గురించి ప్రస్తావన లేకపోవడం బాధను కలిగించిందన్నారు. అధికారిక గీతంలో ఉన్నా లేకపోయినా తెలంగాణ సాయుధ పోరాటం ప్రజల హృదయాల్లో శాశ్వతంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా సీపీఐ నారాయణ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా సాయుధ రైతాంగ పోరాటాల వార్షికోత్సవాలను అధికారికంగా జరపకపోవడంతో పాటు దశాబ్ది ఉత్సవాల్లో కూడా రావి నారాయణరెడ్డిలాంటి వీరుల చరిత్రను ప్రస్తావించలేదన్నారు.

**రావి నారాయణరెడ్డి సేవలు మరువలేనివి**

హిమాయత్‌నగర్: నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి కమ్యూనిస్ట్ పార్టీకి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి అందించిన సేవ లు మరువలేనివని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్యపద్మ అన్నారు. రావి నారాయణరెడ్డి 118వ జయంతి సందర్భంగా మంగళవారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దుం భవన్‌లో ఆయన చిత్ర పటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలన, భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం ఆనాడు జరిగిన సాయుధ పోరాటంలో రావి నారాయణరెడ్డి కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. ఆ పోరాటంతోనే హైదరాబాద్ భారత్‌లో విలీన మైందన్నారు. కమ్యూనిస్ట్ పార్టీ నిర్మాణం కోసం ఎంతో కృషి చేసిన రావి నారాయణ రెడ్డిని స్ఫూర్తిగా తీసుకుని ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర నేత సృజన, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



హిమాయత్‌నగర్‌లోని మఖ్దుం భవన్‌లో రావి నారాయణరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

## కూటమి విజయంతో అభిమానుల సంబురాలు

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 4: ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్ నేతృత్వంలో కూటమి భారీ మెజార్టీతో విజయం సాధించడంతో చంద్రబాబునాయుడు అభిమానులు మంగళవారం సాయంత్రం సంబురాలు జరుపుకున్నారు. రాజేంద్రనగర్ స ర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ దుర్గానగర్ చౌరస్తా వద్ద పటాకులు కాల్చడంతో పాటు మిఠాయిలు పంచిపెట్టారు. బంగారు మైస మ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 101 కొబ్బరికాయలు కొట్టి తమ మొక్కులను చెల్లించుకున్నారు. వెంకటేశ్, కృష్ణగౌడ్, తిరుమలవెంకటేశ్‌గౌడ్, మాధవరెడ్డి, సుధాకర్‌గౌడ్, కాశీగారి యాదగిరి, యంజల మహేశ్, బండారి యాదగిరి, కరుణాకర్‌గౌడ్, శేఖర్‌గౌడ్, దొం త రాజు, ఉస్కెమూరు విజయ్‌కుమార్, చిర ంజీవి, ప్రభాకర్‌గౌడ్, వెంకటరమణ పాల్గొన్నారు.



ఎండీపీ–2–దుర్గానగర్ చౌరస్తాలో సంబురాలు జరుపుకుంటున్న నాయకులు

## గంజాయి విక్రేత అరెస్ట్..గంజాయి స్వాధీనం



బాలానగర్ ఎక్సైజ్ స్టేషన్‌లో గంజాయి విక్రేతను చూపిస్తున్న రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు

బాలానగర్, జూన్ 4:గంజాయి విక్రేతను రంగారెడ్డి జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు అరెస్ట్ చేసి అతడి వద్ద 2 కిలోల 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన బాలానగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకున్నది. రంగారెడ్డి జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ జీవన్ కిరణ్ నేతృత్వంలో మూసాపేటలో నిర్వహించిన తనిఖీల్లో ఒడిశా రాష్ట్రానికి చెందిన బాబుల కరాద్ మూసాపేట మెట్రో స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండటాన్ని రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు గమనించారు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా.. తన వద్ద 2.100 గ్రాముల గంజాయి లభించింది. ఈ మేరకు అతడిని అరెస్ట్ చేసి బాలానగర్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. బాలానగర్ ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

## పాఠ్య పుస్తకాల పంపిణీకి సిద్ధం

జూబ్లీహిల్స్, జూన్ 4: ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు పంపిణీకి సిద్ధమయ్యాయి. ఖైరతాబాద్–2 మండలంలో 6 ఉన్నత పాఠశాలలు, 24 ప్రాథమిక పాఠశాలలతో పాటు 2 సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలున్నాయి. ఆయా పాఠశాలలకు 64,505 పాఠ్యపుస్తకాలు అవసరముండగా మొదటి విడుత 15,600 పుస్తకాలు, రెండో విడుత 32,175 పుస్తకాలను తరలించారు. వీటితో పాటు 10 వేల నోట్ పుస్తకాలు అందినట్లు.. తుది విడుతలో మిగతా పుస్తకాలు, నోట్‌బుక్కులు తరలిస్తామని డిప్యూటీ ఐఓఎస్ శ్రావణ్ కుమార్ తెలిపారు. ఖైరతాబాద్–2 మండలంలో పాఠ్య పుస్తకాల పంపిణీ ప్రారంభించినట్లు తెలిపారు.

